క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



కొత్తపల్లి: మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన మల్‌రెడ్డి తీవ్ర అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నాడు. వైద్య చికిత్సకు సాయం అందించాలని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో రూ.60వేలు మంజూరు కాగా స్థానిక నాయకులు చెక్కును గురువారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రాంరెడ్డి, సాయప్ప, అనంతప్ప, మల్లప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేలు పెన్షన్ అందించాలి



మరికల్: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల ప్రమాద మరణ బీమా రూ. 10 లక్షలకు పెంచడాన్ని స్వాగతిస్తున్నామని ప్రైవేట్ పెయింటింగ్ అసోసియేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు మకం శ్రీనివాస్ అన్నారు. మరికల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు బీమాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచడం హర్షనీయమన్నారు. అలాగే సహజ మరణానికి రూ. 1,30,000 నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేయగా, కేవలం రూ.2 లక్షలకు పెంచడం సరి కాదన్నారు. 60 ఏళ్లు దాటిన కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పల్లెగడ్డ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

మరికల్: మండలంలోని పల్లెగడ్డ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ మీర్జా కరీముల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా పాఠ్యాంశాల బోధన ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు శివకుమార్, మదుసూధన్‌లు పాల్గొన్నారు.

కోస్గిలో కంటి వైద్యశిబిరం

కోస్గి రూరల్: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ , కోస్గి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరం విజయవంతమైందని వైద్యులు భాస్కర్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన శిబిరానికి 43 మంది రాగా పరీక్షించి 25 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిని పాలమూరు జిల్లాలోని రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహేందర్‌గౌడ్ , మాజీ అధ్యక్షులు పూర్ణచంద్రయాదవ్ ,ట్రెజరర్ బెజ్జు వెంకట్రాములు ,వెన్నశేఖర్ తదితరులు ఉన్నారు.

జీఎస్టీ మదింపుతో పేదలకు ఊరట

నారాయణపేట టౌన్: కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీ మండల కమిటీ తీసుకొచ్చిన మదింపుతో పేదలకు, రైతులకు పెద్ద ఊరట లభించిందని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు. గురువారం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పగడాల శ్రీనివాస్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం నిర్ణయంతో అట్టడుగు ప్రజలకు లాభం చేకూరుతుందన్నారు. ఇక నుంచి జీఎస్టీలో 5,18 శాతం స్లాబులే ఉంటాయని 12, 28 స్లాబ్‌లు మాయమౌతాయన్నారు. ఈ మార్పుతో నిత్యావసరాలపై ఉన్న 12 శాతం జీఎస్టీ ఇక నుంచి 5 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. రవాణా కోసం వాడే పెట్రోల్, డీజిల్ తదితర వాటిని 18 శాతం స్లాబ్‌లోకి తేవడం శుభపరిణామన్నారు.

మతమార్పిడులకు అడ్డుకట్ట వేయండి

మక్తల్: పట్టణంలో మత మార్పిడులు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీపి, భజరంగ్‌దళ్, హిందుధార్మిక సంఘాలు కోరాయి. ఈ మేరకు గురువారం ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేశవనగర్‌లో పలువురు మహిళలు మతమార్పిడిలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో వారిని అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సదరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వీరి పూర్తి బయోడేటాను తీసుకొని విచారిస్తున్నారు.



సరాఫ్‌బజార్‌లో ప్రతిష్ఠించిన గణేశుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



నాగిరెడ్డిపల్లిలో గణనాథుడిని ఎడ్లబండిపై నిమజ్జనానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు



హిందుపూర్‌లో లంబోదరుడికి పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

బొజ్జ గణపయ్య.. వెళ్లి రావయ్యా



కోస్గిలో జన సమూహం మధ్య నిమజ్జన వేడుకలు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ, జాజాపూర్, అప్పిరెడ్డిపల్లి, శ్యాసన్‌పల్లి, బండగొండ, జలాల్‌పూర్ తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన లంబోదరులను విశిష్ఠ అలంకరణలతో శోభాయాత్ర నిర్వహించారు. అలాగే పట్టణంలోని శ్రీహంసవాహిని, శ్రీసరస్వతి శిశుమందిర్, కిడ్స్‌హోం, శ్రీసాయి పాఠశాల, ఎస్‌వీఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకులను కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేశారు.

భారీ వినాయకుడి నిమజ్జనం

కోస్గి/కోస్గి రూరల్: పట్టణంలోని పలు కాలనీల్లో తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథుల నిమజ్జన వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. మున్నూర్‌వీధిలో ఏటా అతిపెద్ద వినాయకుడిని ప్రతిష్ఠించే ఆనవాయితీని ఈ సంవత్సరం కొనసాగిస్తూ 18 అడుగుల భారీ వినాయకుడిని ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజల అనంతరం భారీ గణేశుడి శోభాయాత్రను ప్రారంభించారు.

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక శ్రీ వేద సరస్వతి జూనియర్ కళాశాలలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుడిని గురువారం గంగమ్మ ఒడికి చేర్చారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్థానికంగా ఉన్న కొండారెడ్డి పల్లి చెరువులో గంగమ్మ ఒడికి చేర్చారు.

ఊట్కూరు/దామరగిద్ద/మక్తల్/నర్వ: ఆయా మండలాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు 9 రోజుల పూజల అనంతరం గురువారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన ఏకదంతుడిని ఆనవాయితీ ప్రకారం ఎడ్లబండిపై ప్రత్యేక భజనలతో నిమజ్జనానికి తరలించారు.

గణేశుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నారాయణపేట టౌన్: సరాఫ్ బజార్ బాలాజీ మందిరంలో మహేశ్వరి సమాజ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడితో పాటు బాలాజీ మందిరంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఉత్సవాలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివా రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ భట్టడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రత్యేక పూజలు

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో ప్రతిష్ఠించిన గణేశుడిని బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో దర్శించుకొని పూజలు నిర్వహించారు.



క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



వినాయకుడిని గంగమ్మ ఒడికి తీసుకెళ్తున్న ఎస్‌వీఎస్ కళాశాల ఉపాధ్యాయులు



గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న యువతులు



ధన్వాడలో మట్టి వినాయకుడిని ఎద్దులబండిపై నిమజ్జనానికి తీసుకెళ్తున్న నిర్వాహకులు

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 6న వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పవర్ సమస్య తలెత్తకుండా పవర్‌పాయింట్ బోర్డులను సిద్ధం చేశారు. మొత్తం 265 పవర్ బోర్డులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల పవర్ కనెక్షన్ కోసం సర్వీస్ వైర్ పైన ఆధారపడాల్సిన అవసరం లేకుండా నేరుగా పవర్ బోర్డుల ద్వారా కనెక్షన్ తీసుకోవచ్చన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో గుంతలు పడిన రోడ్లను కంకర సాయంతో బాగు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

ఊట్కూరు: గణేశ్ నిమజ్జనం పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ లింగయ్య సిబ్బందికి సూచించారు. గురువారం ఊట్కూరు పోలీసు స్టేషన్ ఆవరణలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా బందోబస్త్‌కు వచ్చిన పోలీసు సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గణేశ్ నిమజ్జన రూట్‌లో 28 అదునాతన సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గణేశ్ ఊరేగింపు సమయంలో వీడియో రికార్డింగ్ చేయించాలని అధికారులకు సూచించారు. వీధుల్లో ఉండే పోలీసులు తమకు కేటాయించిన ప్రదేశంలో అప్రమత్తంగా ఉంటూ సమన్వయం చేసుకొని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అలాగే చిన్నపిల్లలు, వృద్ధులు నిమజ్జనానికి రాకుండా చూడాలని సూచించారు. సమావేశంలో సీఐ రామ్‌లాల్, ఆర్ఐ నర్సింహ, ఎస్ఐలు రమేష్, అశోక్, బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

మద్దూరు, కొత్తపల్లి: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని అధికారులు ఉమ్మడి మద్దూరు మండలం నుంచి ఐదుగురిని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి ఎంపిక చేశారు. కొత్తపల్లి మండలం నిడ్జింత ఉన్నత పాఠశాల నుంచి శ్రీనివాస్, వెంకట్‌రాములు, దుప్పడిగట్టు పాఠశాల నుంచి మోహన్‌రెడ్డి, మద్దూరు ఉన్నత పాఠశాల నుంచి రఘు, బాలికల ఉన్నత పాఠశాల నుంచి మాధవిని ఎంపిక చేశారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

నారాయణపేట టౌన్: మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని కావునా ప్రతి ఒక్కరూ దైవచింతన అలవరుచుకొని భగవంతునికి చేరువ కావాలని మాణిక్ ప్రభు మహారాజ్ సంస్థ పీఠాధిపతి జ్ఞానరాజ్ మాణిక్ ప్రభు మహారాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని కోర్‌వార్ కుటుంబీకులతో పాటు పలు వార్డులోని భక్తుల స్వగృహాలలో పాదపూజ ఆశీర్వాచనం, ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు పలు సూచనలు చేశారు. ప్రభు మహారాజ్ సంస్థ కార్యదర్శి ఆనంద్‌రాజ్, అర్చకులు గురునాథ్ మాణిక్ కోర్వార్, చైతన్య కోర్వార్, రామకృష్ణ కోర్వార్ పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

ఆత్మకూర్: దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును కూడా పాలకులు అమలు చేయకపోవడం విచారకరమని, ఆర్పీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు అన్నారు. గురువారం పురపాలికలో మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు ఆర్పీలతో కలిసి వినతిపత్రం అందించారు. కేవలం రూ.6 వేల వేతనంతో కుటుంబాలు గడవక పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు ఇవ్వడంతోపాటు నెలకు రూ.26 వేలు వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సర్వేపల్లి సేవలు చిరస్మరణీయం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు వెంకటేశ్వరి

నారాయణపేట రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పట్టణం, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సర్వేపల్లి చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులంతా కలిసి టీచర్లను శాలువాతో సన్మానించి మెమోంటో అందజేశారు.

ఉపాధ్యాయులు.. జాతి నిర్మాతలు

మాగనూర్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవంతో కూడుకున్నదని, ఉపాధ్యాయులు జాతి నిర్మాతలతో సమానమని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మన్న అన్నారు. కోల్పూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది వారి భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు.

ఎంఈఓ నివాళి

ధన్వాడ: మండల కేంద్రంలో తొలి భారత ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్సీ భవనం ముందు ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి మండల విద్యాశాఖ అధికారి గాయత్రి పూలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రదీప్‌కుమార్, కృష్ణయ్య, రామకృష్ణ, గంగమ్మ, సిబ్బంది రాఘవేందర్‌నాయుడు వెంకట్రాములు, నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దాలి

నర్వ: ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకులని పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం భాగ్యలక్ష్మి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వేపల్లి చిత్రపటానికి నివాళి అర్పించి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కోస్గి రూరల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులురాలు వెంకటేశ్వరి ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లికార్జున్, అలాగే ఉపాధ్యాయులు సుజాత, తుల్జారాం, మహెంద్రచారి, శ్రీనివాస్, వీరుమల్లేశ్‌ను పూలమాలలు శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులలో సత్ప్రవర్తనను పెంపొందించి విద్యాభివృద్ధికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవినాయక్ , రాజేందర్‌రావు , శ్రీనివాస్‌రావు , శివరాములు, శ్రీకాంత్, గీతాలక్ష్మి, శశిరేఖ , పత్యావతి తదితరులు ఉన్నారు.



జాజాపూర్‌లో సర్వేపల్లికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆదాయం లేక.. అభివృద్ధి జరగక



రెవెన్యూ గ్రామంగా ప్రకటించని కృష్ణా మండల కేంద్రం

- అభివృద్ధికి నోచుకోని కృష్ణా, ఖాన్‌దొడ్డి గ్రామాలు
- రెవెన్యూ పంచాయతీలుగా మార్చాలంటున్న ప్రజలు

కృష్ణా: కృష్ణా పేరుకే మండల కేంద్రం.. అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. ఈ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం, తాగునీరు, డ్రైయినేజీ లేకపోవడంతో స్థానిక యువతకు ఉపాధి చూపించకపోవడంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే గ్రామం అభివృద్ధి బాట పట్టకపోవడానికి ఇక్కడ ఏలాంటి భూములు లేకపోవడంతో రెవెన్యూ నిధులు అందకపోవడమే అని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఈ గ్రామంలో ఉన్న భూములు హిందూపూర్ పంచాయతీ కిందకు వస్తాయి. అలాగే మండలంలోని మరో పంచాయతీ ఖాన్‌దొడ్డి గ్రామాన్ని కూడా రెవెన్యూ గ్రామంగా పరిగణించకపోవడంతో గ్రామం అభివృద్ధిలో వెనుకబాటుతనానికి గురవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా ప్రకటించి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.



ఖాన్‌దొడ్డి గ్రామ పంచాయతీ

నిధుల కొరతతో తప్పని ఇబ్బందులు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి స్టేట్ ఫైనాన్స్, సెంట్రల్ ఫైనాన్స్ నుంచి కొంతమేర నిధులు వస్తుంటాయి. ఈ నిధులను జనాభా ప్రాతిపదికన విడుదల చేస్తారు. కృష్ణాలో 2500 మంది జనాభాకుగాను 1650 మంది ఓటర్లు అలాగే ఖాన్‌దొడ్డి గ్రామ పంచాయతీలో 1000 మంది జనాభాకు 520 మంది ఓటర్లు ఉన్నారు. దీంతో చిన్న పంచాయతీలుగా పరిగణించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.లక్ష లోపు నిధులు విడుదల చేస్తున్నాయి. ఈ నిధులు కూడా సక్రమంగా రాకుండా రెండేళ్లకు ఒకమారు వస్తుండడంతో అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఖాన్‌దొడ్డిని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి

మా గ్రామంలోని భూములన్నీ కుస్నీ గ్రామ పంచాయతీ కిందకు వస్తాయి. మా గ్రామాన్ని కేవలం పంచాయతీగా గుర్తించడంతో రెవెన్యూ గ్రామాలుగా వచ్చేంతా నిధులు విడుదల కావడం లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి తమ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి. ఈ విషయంపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేయాలి.

–నూకలి తిప్పయ్య, ఖాన్‌దొడ్డి గ్రామం

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

మండలంలోని కృష్ణా, ఖాన్‌దొడ్డి గ్రామాలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించడం ప్రభుత్వం చేతుల్లో ఉంది. ఒక వేళ రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలంటే గ్రామాల్లోని ప్రజలు ఆస్తులను, సర్వేనెంబర్‌లను ,గ్రామ రెవెన్యూ హద్దులను గుర్తించాలి. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఈ ప్రక్రియ చేపట్టవచ్చు.

–శ్రీనివాస్,తహశీల్దార్ కృష్ణా మండలం

పేదలకు అందని సంక్షేమ పథకాలు

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ప్రభుత్వ పరంగా నేటికీ సంక్షేమ పథకాలు అందకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, మేకల ఆంజనేయులు అన్నారు. మండలంలోని సింగంపేటలో సర్వేను నిర్వహించారు. గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లడానికి దారి లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా భృతిని కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, సత్యన్న, ఆంజనేయులు, పార్వతమ్మ, శాంతమ్మ, కతలన్న, యువకర్త పాల్గొన్నారు.



సింగంపేటలో సర్వే నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

ఆత్మకూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిపించి సత్తా చాటుదామని మాజీ ఎంపీపీలు బంగారు శ్రీనివాసులు, విరేశలింగం, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని దేవరపల్లిలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేవరపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

నారాయణపేట టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువకులు రక్తదానానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సూచించారు. హైయత్ కేర్ ఫార్మసీ, హైయత్ కేర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గురువారం ఉర్దూ భవనంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రియాజుల్ హక్, మార్కెట్ కమిటీ చైర్మెన్ సదాశివారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగూరావ్ నామాజీ, జిల్లా కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ అధ్యక్షుడు గందె ఉమాకాంత్ ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సలీమ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



ఊట్కూరులో రక్తదానం చేస్తున్న యువకులు

ఊట్కూరు: వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని బిజ్వార్ గ్రామంలో గురువారం పవనపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు.

ఘనంగా నబీషా ఉత్సవాలు

అమరచింత: మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని పట్టణంలో గురువారం నబీషా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి గంధోత్సవం, గురువారం ఉర్సు సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.